వంద ఎకరాల్లో ఎఐ సిటీ

- పది నుంచి 12 ఐటీ, ఫార్మా క్లస్టర్లు
- కులగణన, రెండు లక్షల ఉద్యోగాలకు ఓకే
- మాజీ ప్రధాని మన్మోహన్, సోనియాగాంధీలకు కృతజ్ఞతలు
- గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన తమిళిసై
- గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆరంభం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

"తెలంగాణప్రజలు వారి ఆంకాంక్షలు ప్రతిబింబించేలా నిజమైన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం గల పరిపాలన కోరుకున్నారు. తెలంగాణ ప్రజల విజ్ఞతను అభినందిస్తున్నా. వారి తీర్పు పౌర హక్కులకు, ప్రజాస్వామిక పరిపాలనకు నిదర్శనం." అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గురువారం గవర్నర్ శాసనసభ హాల్‌లో ఉభయ సభలనుద్దేశించి మాట్లాడారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు రాసిన కవిత్వాన్ని స్మరించుకుంటూ గత ప్రభుత్వ నిరంకుశ విధానాలను గవర్నర్ తూర్పార బట్టారు. తెలంగాణలో ఇప్పుడు ప్రజల కోసం ప్రజల ద్వారా ప్రజాపాలన జరుగుతుంది అంటూ ప్రస్తుత ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ, మాజీ సిఎం కెసిఆర్ పాలనను దెప్పిపొడిచారు. ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా గవర్నర్‌ను సభలోకి తీసుకొని వచ్చారు. అనంతరం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాదరావుతో కలిసి ఆమె వేదికపైకి వెళ్లి, ప్రారంభోపన్యాసం చేశారు. తమ ప్రసంగంలో ఆమె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందించారు. తెలంగాణ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, సోనియా గాంధీలకు రాష్ట్ర ప్రభుత్వం రుణపడి ఉందని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఆర్‌టిసి బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి 'మహాలక్ష్మి' పథకం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి పెంపును ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. త్వరలో రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గ్యారెంటీలు అమల్లోకి తెస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ)కు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని, దానికోసం హైదరాబాద్‌లో 50 నుంచి 100 ఎకరాల్లో ఎఐ సిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) ద్వారా రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు చేపడతామని, మరోసారి ఆ నది హైదరాబాద్‌కు జీవనాడిగా మారుతుందని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టు నుంచి విద్యారంగం వరకు, ధరణి కమిటీ ద్వారా భూమికి సంబంధించిన సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నాలు ముమ్మరం చేసిందన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రాన్ని విడుదల చేసి, గత ప్రభుత్వం ఎంత అసమర్థంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిందో ప్రజలకు స్పష్టంగా చెప్పామని తెలిపారు. తెలంగాణ ప్రజలు గత ప్రభుత్వానికి ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే, పదేళ్ల తర్వాత ఇప్పటి ప్రభుత్వానికి అప్పులపాలైన రాష్ట్రాన్ని అప్పగించారని విమర్శించారు. ప్రజలపై భారం పడకుండా రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల్ని మెరుగుపర్చడమే ప్రభుత్వ తక్షణ కర్తవ్యమని, దానికి ఈ బడ్జెట్ ఒక సదవకాశమని పేర్కొన్నారు. దశాబ్దకాలంలో నష్టపోయిన సంస్థలన్నీ తిరిగి కోలుకునేలా చేస్తామన్నారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, సవాళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ప్రత్యేక నైపుణ్య వర్సిటీలు ఏర్పాటు చేస్తామని, 12 ఫార్మా విలేజ్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మహిళ, వికలాంగ పారిశ్రామిక వేత్తలకు తోడ్పాటు అందిస్తామని, సమగ్ర డిజిటల్ అక్షరాస్యతను అమలు చేస్తామని చెప్పారు. రూ. రెండు వేల కోట్లతో ప్రభుత్వ ఐటిఐలను ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తామనీ కులగణన చేపడతామనీ వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ) తోడ్పాటు కోసం నూతన విధానాన్ని తెస్తామన్నారు. ఇటీవల స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు సిద్ధమయ్యారని చెప్పారు. అన్నిరంగాలు, వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్యుత్తు ఉత్పాదక వ్యయాన్ని తగ్గించేందుకు సమగ్ర ఇంధన పాలసీ తెస్తామన్నారు. వారసత్వ సంపద పరిరక్షణ, పర్యాటకాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. కాళోజీ కవితతో ప్రసంగాన్ని ప్రారంభించిన గవర్నర్ ముగింపులో తమిళకవి సుబ్రమణ్య భారతి రాసిన 'విత్త నిర్వహణకు వివేక కాంతిపుంజం అవసరం' అనే వాక్యం చెప్తూ, మాటలకంటే చేతలు ముఖ్యం అని ముగించారు.

ఆటోలో అసెంబ్లీకి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు గురువారం బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆటోలో వచ్చారు. అయితే, అసెంబ్లీ దగ్గరలో ఆయనను పోలీసులు అడ్డుకుని ఆటోను లోపలికి అనుమతించలేదు. దీంతో పోలీసులు, ఎమ్మెల్యే మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకంతో రాష్ట్ర సర్కార్ ఆటో కార్మికుల పొట్టగొడుతోందని తెలియజేయడానికే ఆటోలో అసెంబ్లీకి వచ్చినట్టు చెప్పారు. ఉచిత ప్రయాణం మహిళలకు మేలు చేస్తున్న పథకమే అయినా.. ఆటో కార్మికుల పొట్ట కొడుతోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకుంటున్నట్టు వాపోయారు. కార్మికులకు ఓ దారి చూపిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఆటో కార్మికులకు కాంగ్రెస్ సర్కార్ ఇస్తానన్న రూ.12 వేల ఆర్థిక సాయం వెంటనే విడుదల చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కైనెటిక్ గ్రీన్‌'ఇ-లూనా' ఆవిష్కరణ

- సింగిల్ ఛార్జింగ్‌తో 110 కిలోమీటర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకప్పుడు మార్కెట్‌లో గుర్తింపు కలిగిన కైనెటిక్ గ్రీన్‌కు చెందిన లూనా కొత్తగా మళ్లీ విద్యుత్ ద్విచక్ర వాహనంతో మార్కెట్లోకి వచ్చేసింది. ఇ-లూనా పేరుతో ముందుకు వచ్చింది. ఇది రైతులు, చిరు వ్యాపారుల వినియోగానికి, వస్తూత్పత్తుల డెలివరీలకు వీలుగా ఉంటుందని ఆ సంస్థ తెలిపింది. ఢిల్లీ ఎక్స్‌షోరూం ధరను రూ.69,990గా నిర్ణయించింది. 2కిలోవాట్ సామర్థ్యం కలిగిన బ్యాటరీ, నాలుగు గంటల్లో పూర్తిగా చార్జింగ్ కాగలదని.. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 110 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని ఆ సంస్థ పేర్కొంది. 150 కిలోల వరకు బరువును మోయగల ఇ-లూనా గంటలకు 50 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించగలదని ఆ సంస్థ తెలిపింది.

వినికిడి లోపం చిన్నారులకు 'మెడికవర్' కొత్త జీవితం

ప్రజాశక్తి - హైదరాబాద్

మెడికవర్ హాస్పిటల్లోని ఓటోలారిన్జాలజీ విభాగంలో ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సంపూర్ణ ఘోష్ వినికిడి లోపంతో బాధపడే అనేక మంది పిల్లలు, పెద్దలకు గత ఆరు నెలల్లో 10 మందికి పైగా కోక్లియర్ ఇంప్లాంటులను విజయవంతంగా నిర్వహించారని ఆ హాస్పిటల్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. "పుట్టుకతో వచ్చే లోతైన వినికిడి లోపం ఉన్న పిల్లలకు మరియు పెద్దలకు కోక్లియర్ ఇంప్లాంట్లు ద్వారా వారికి నూతన జీవితాన్ని అందిస్తున్నారని పేర్కొంది. "చాల మంది చెవుడు ఉన్నకాని నలుగురిలో చెప్పుకోవడానికి ఇష్టపడరు కానీ వారు చెప్పకపోయినా చెప్పే వారికి చూసేవారికి అర్థం అవుతుంది. ఇప్పుడున్న అత్యాధునిక చికిత్స ద్వారా మనం సాధ్యమైనంతవరకు వారికి నూతన జీవితాన్ని అందించవచ్చు. ప్రతి కోక్లియర్ ఇంప్లాంట్ పిల్లల జీవితంలో ఒక లోతైన పరివర్తనను సూచిస్తుంది. వారికి ధ్వని మరియు ప్రసంగం అవకాశాలతో నిండిన భవిష్యత్తును అందిస్తుంది" అని డాక్టర్ సంపూర్ణ ఘోష్ పేర్కొన్నారు.

గురుకులాల్లో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యాలయాల సంస్థల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తక్షణమే ప్రకటించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆ తర్వాతే కొత్త నియామకాల ప్రక్రియను చేపట్టాలని కోరారు. గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శి కె సీతాలక్ష్మి, మైనార్టీ గురుకుల కార్యదర్శి ఐషా మషరత్ ఖానం, తెలంగాణ గురుకుల పాఠశాలల కార్యదర్శి రమణ కుమార్, బిసి గురుకులాల కార్యదర్శి మల్లయ్య భట్టును గురువారం హైదరాబాద్‌లో పదోన్నతులు, బదిలీలతోపాటు ఇతం సమస్యలపై ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. 317 జిఒ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున ప్రస్తుతానికి అది తేలే వరకు బదిలీలకు ఆటంకంగా మారిందని అధికారులం టున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం టిజిటి, పిజిటి అధ్యాపకులుగా పనిచేస్తున్న వారు పదోన్నతులు పొందలేనట్టయితే వారు సీనియార్టీని కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. కార్యదర్శులకు ఈ విషయాలను వివరించగా, వారి కంటే ముందే పదోన్నతులు చేపట్టే అవకాశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. దీంతోపాటు ఉపాధ్యాయుల మెడికల్ పెండింగ్ బిల్లులు, సిపిఎస్ బకాయిలు, స్టాఫ్ నర్స్, ఆర్ట్ టీచర్, హిందీ టీచర్ తదితర పోస్టులన్నింటికీ పదోన్నతులు కల్పించే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి సత్వరమే సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

ప్రతిపక్ష నేతగా కెసిఆర్ ఎక్కడ?

- ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలి
- ఆయన తన స్థాయిని తగ్గించుకుంటున్నారు
- స్పీకర్ నిర్ణయం ప్రకారమే...బిఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయ మార్పు
- బిఎసికి కడియం, కెసిఆర్ పేర్లు ఇచ్చి...హరీశ్ ఎలా వస్తారు?
- కాళేశ్వరంపై విచారణకు రిటైర్డ్ జడ్జికి హైకోర్టు సూచన
- విలేకర్లతో ఇష్టాగోష్టిలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే, ప్రతిపక్ష నేత కెసిఆర్ ఎక్కడ ఉన్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలని ఆయన్ను కోరారు. కెసిఆర్ శాసనసభకు రాకుండా తన స్థాయిని తగ్గించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోవడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. చివరకు ఆయన ఎక్స్‌పైరీ మెడిసిన్‌లా తయారయ్యారని విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని శాసనసభ ప్రాంగణంలో గల తన చాంబర్‌లో సిఎం విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు బిఆర్‌ఎస్‌ను పట్టించుకోవడం లేదని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరు కాకపోవడంతో ఆయన ఏంటనేది ప్రజలకు తెలిసిపోయిందన్నారు. బిఎసికీ రాలేదంటే, ఆయన చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చునని ఎద్దేవా చేశారు.

హరీశ్‌ను ఎందుకు అడ్డుకుంటాం

బిజినెస్ అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేసేటప్పుడు బిఆర్‌ఎస్ తరుపున కెసిఆర్, కడియం శ్రీహరి పేర్లను లేఖలో పేర్కొన్నారని గుర్తు చేశారు. అలాంటప్పుడు ఆ సమావేశానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎలా వస్తారని ప్రశ్నించారు. కెటిఆర్ కుమారుడు హిమాన్షు వస్తానంటే, కుదురుతుందా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావును బిఎసికి రాకుండా తామెందుకు అడ్డుకుంటామన్నారు. ప్రతి దానికి నియమ నిబంధనలు ఉంటాయని, ఉగ్రవాది కసబ్‌ను ఉరి తీసేందుకైనా కొన్ని నిబంధనలు ఉంటాయని గుర్తుచేశారు. టిఎస్‌పిఎస్‌సికి సంబంధించి పూర్తి ప్రొసీజర్‌తో వెళుతున్నామనీ, భవిష్యత్తులో నిరుద్యోగులకు ఇబ్బందులు ఉండకూడదనేది తమ లక్ష్యమన్నారు. బిఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయం మార్పు స్పీకర్ నిర్ణయమేనని రేవంత్ అన్నారు. అసెంబ్లీలో కులగణన తీర్మానం ఉంటుందన్నారు. ఇంకా ఏమైనా అంశాలు చర్చించాల్సిన అవసరముందనుకుంటే, స్పీకర్ సభ జరిగే రోజులను పొడిగించవచ్చన్నారు. గత ప్రభుత్వమే ప్రాజెక్టులను కెఆర్‌ఎంబికి అప్పగించిందన్నారు. నాగార్జున సాగర్‌ను ఎపి సిఎం జగన్ పోలీసులతో ఆక్రమించినా ఆనాటి సిఎం కెసిఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. ప్రతిరోజు 12 టిఎంసిలను ఎపి తీసుకుని వెళుతుంటే, అడ్డు చెప్పలేదన్నారు. 'బేసిన్లు లేవు...భేషజాలు లేవు' అంటూ ఎపికి కేసీఆర్ కమిట్‌మెంట్ ఇచ్చారని, అందుకు కృష్ణా బేసిన్‌లో బిఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని చెప్పారు.

విజయసాయిరెడ్డి నాన్ సీరియస్ పొలిటిషియన్

ముఖ్యమంత్రిగా తాను కేసీఆర్‌ను కూడా కలుస్తానని సీఎం రేవంత్ ఈ సందర్భంగా చెప్పారు. విజయ సాయి రెడ్డి నాన్ సీరియస్ పొలిటిషియన్ అనీ, అలాంటి వాళ్ళ గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కెసిఆర్, బిఆర్‌ఎస్ గురించి ప్రజలు ఆలోచించడం మానేశారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు సిట్టింగ్ జడ్జిని ఇవ్వలేమని హైకోర్టు చెప్పిందన్నారు. రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించుకోవాలని సూచించినట్టు తెలిపారు. ఉన్నత న్యాయస్థానం చెప్పిన అంశంపై మంత్రివర్గంలో లేదా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. మిషన్ భగీరథపైనా విచారణకు ఆదేశించామన్నారు. ఉద్యోగ నియామకాల విషయంలో స్పష్టతతో ఉన్నామని వివరించారు. విధానపరమైన లోపాలు లేకుండా పాలన సాగిస్తున్నామని సీఎం ఈ సందర్భంగా తెలిపారు. రాజ్యసభ ఎన్నికల్లో ఎంతమంది పోటీ చేస్తారనే విషయం అధిష్టానం చూసుకుంటుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అర్ధసత్యాలతో గవర్నర్ ప్రసంగం

- ఎగవేతకు సంకేతమిచ్చినట్టుంది...
- దార్శనికత లేని కాంగ్రెస్ సర్కార్ : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీలో గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ చేసిన ప్రసంగం ఆసాంతం అర్ధసత్యాలతో ఉందని బిఆర్‌ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. వంద రోజుల్లో అమలు చేస్తామంటూ చెప్పిన ఆరు గ్యారంటీల్లో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ తప్ప మరే ఇతర హామీల అమలు ప్రస్తావన ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగమంటే ప్రభుత్వం ఆ ఏడాదిలో చేయబోయే అంశాలతో కూడిన డాక్యుమెంట్ అనీ, అలాంటి ప్రసంగంలో హామీల అమలు ప్రస్తావన లేకపోవడం వాటిని ఎగవేసేందుకేనని ఆగ్రహం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి దార్శనీకత లేదని, భవిష్యత్తుపై ప్రజల్లో ఆందోళన కలిగించేలా గవర్నర్ ప్రసంగం ఉందని హరీశ్ రావు దుయ్యబట్టారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో కలిసి గురువారం హరీశ్ రావు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. డిసెంబర్ తొమ్మిదిన ప్రమాణ స్వీకారం చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి దాన్ని ముందుకు జరిపి ఆ నెల ఏడున ప్రమాణం చేశారని తెలిపారు. అధికారంలోకి రాగానే అమలు చేస్తానన్న హామీలను మాత్రం వాయిదా వేశారని ఎద్దేవా చేశారు. గవర్నర్ ప్రసంగంలోనూ వాటి అమలుపై స్పష్టత లేదని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పలేదని హరీశ్ ఈ సందర్భంగా విమర్శించారు. వరితో పాటు ఆయా పంటలు వేసే రైతులకు బోనస్ ఇచ్చే విషయమై ఒక్క మాటా లేదన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిపై ఒక్క మాట కూడా చెప్పలేదన్నారు. నిరుద్యోగ భృతి హామీని సైతం విస్మరించారని తెలిపారు. ప్రజావాణిలో ప్రజల నుంచి తానే వినతులు స్వీకరిస్తానని చెప్పిన సిఎం రేవంత్ రెడ్డి ఒక రోజు స్వీకరించి మొఖం చాటేశారని విమర్శించారు. అలాంటి ప్రజావాణి గురించి కూడా గవర్నర్ చేత అర్ధసత్యాలే చెప్పించారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీల్లో 13 హామీలున్నాయని చేశారు

'పాలేరు'.. కన్నీరు

- లక్ష ఎకరాలకుపైగా ఆయకట్టు విలవిల
- తాగునీటి అవసరాలూ తీరేలా లేవ్..
- ప్రస్తుత నిల్వలతో మార్చి 15 వరకు తాగునీరు
- రెండు నెలల తర్వాత మూడు జిల్లాల్లో దాహార్తి తప్పదు
- మంత్రి పొంగులేటి చొరవతో అధికారుల దృష్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలేరు జలాశయం అడుగంటుతోంది. రోజురోజుకూ రిజర్వాయర్‌లో నీటిమట్టం పడిపో తోంది. నీటిమట్టం గణనీయంగా పడిపోతుండ టంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. తాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంచేందు కు సాగర్ నుంచి విడుదల చేయిస్తున్నారు. అయితే, ఆ నీటిని కూసుమంచి, నేలకొండపల్లి మండలాల ఆయకట్టు రైతులు మూడ్రోజుల కిందట విడుదల చేసుకున్నారు. వెంటనే అధికారులు ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి పడిపోతే తాగునీటికి సైతం ఇబ్బందులు తలెత్తుతాయని రైతులకు నచ్చజెప్పి నీటి విడుదలను నిలుపు చేయించారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా, ప్రస్తుతం 17 అడుగుల వరకు నీరు ఉంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నాగార్జునసాగర్‌లోనూ ఆశించిన స్థాయిలో నీరు లేదు. కృష్ణా పరివాహకంలో వర్షాలు సరిగా కురవకపోవడంతో ఆగస్టు నుంచే సాగర్ ఆయకట్టుకు నీటికష్టాలు మొదలయ్యాయి. ఖమ్మం జిల్లాలో లక్ష ఎకరాల ఆయకట్టుకుపైగా నీటి సమస్యతో అల్లాడు తోంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవతో అధికారులు పాలేరు జలాశయం నీటిమట్టం పెంచేందుకు చర్యలు చేపట్టారు. రెండ్రో జులుగా సాగర్ నుంచి పాలేరుకు నీరు విడుదల చేస్తున్నా.. ఎగువ ప్రాంతం నుంచి సరైన ఇన్‌ఫ్లో రిజర్వాయర్‌కు చేరడం లేదు.

సాగునీరు లేనట్టే..!

ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీరు తప్ప సాగర్ ఆయకట్టులో సాగు నీరు ఇచ్చే పరిస్థితి లేదని అధికారులు తెలిపారు. ప్రస్తుత ఉన్న నీటి నిల్వలు, ఇన్‌ఫ్లో ఆధారంగా చూస్తే తాగు నీరు సైతం మార్చి 15 వరకే ఇవ్వగలిగే పరిస్థితి ఉంది. దాదాపు రెండు, మూడు నెలల తర్వాత సాగర్ నుంచి పాలేరుకు నీరు విడుదల చేశారు. ఆ నీటిలో 40% వృథాగానే పోతుందని అధికారులు చెబుతున్నారు. ఎగువన రైతు లు మోటార్లు పెడుతుండటం, ఎక్కువ రోజులు గా కాల్వలు ఎండిపోవడం, వివిధ రూపాల్లో నీరు వృథా అవుతుంది. నీరు విడుదలయ్యాక ఎగువ ప్రాంతలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాల రైతులు వాటిని వినియోగించడంతో ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో రిజర్వాయర్‌కు చేరలేదు. మంగళవారం నుంచే కొంత మేర నీటి ప్రవాహం పెరిగింది. ఎన్నెస్పీ అధికారుల లెక్కల ప్రకారం 1.2 టిఎంసిలు పాలేరు కు వదిలినట్టు చెబుతున్నా వృథా పోను 0.6 టిఎంసిల నీరు మాత్రమే రిజర్వాయర్‌లోకి చేరుతోంది.

తాగునీటికీ కటకట

పాలేరు రిజర్వాయర్ ఆధారంగా నిర్వహి స్తున్న మిషన్ భగీరథ పథకానికి సైతం నీరు అందేలా లేదు. రిజర్వాయం ద్వారా పతిరోజూ 150 క్యూసెక్కుల నీరు మిషన్ భగీరథ ప్రాజెక్టుతోపాటు పాలేరు డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టులకు వినియోగిస్తున్నారు. ఇక్కడి నుంచే ఖమ్మం, సూర్యాపేట, మహబూ బాబాద్ జిల్లాలకు తాగునీరు సరఫరా అవుతోంది. కృష్ణా బేసిన్‌లో సరైన వర్షాలు లేని కారణంగా తాగునీటికీ కటకట ఏర్పడే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా రిజర్వాయర్‌ను మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టు నీటిమట్టాన్ని పరిశీలించా రు. జీళ్లచెరువులోని మిషన్ భగీరథ ప్రాజెక్టునూ సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆశించిన స్థాయిలో చేరని నీరు

పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ నుంచి నీరు ఆశించిన స్థాయిలో చేరడం లేదు. కనీసం తాగునీటి అవసరాలకు సరపడా నీరందే పరిస్థితి లేదు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ నుంచి కూడా నీరందే పరిస్థితి లేదు కాబట్టి నాగర్జునసాగర్ తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. కనీసం 1.5 టిఎంసిల నీరు అందితేనే తాగునీటి అవసరాలైనా తీరుతాయని అధికారులు చెబుతున్నారు. అదీ మార్చి వరకే సరిపోతాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలలో తాగునీటి అవసరాలకూ పాలేరు నుంచి నీరందే పరిస్థితి ఉండదని అధికారుల అంచనా.

తాగునీటికే కష్టం..ఎం.వెంకటేశ్వర్లు, ఇఇ ఇరిగేషన్

తాగునీటి అవసరాలకే నీరు అందించే పరిస్థితి లేదు. కాబట్టి రైతులు సాగునీటి కోసం ఎదురు చూడొద్దు. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీటిని బట్టి మార్చి 15 వరకు తాగునీరు ఇవ్వొచ్చు.

పుస్తకాల జాతర వచ్చేసింది..

- నేటి నుంచి హైదరాబాద్ జాతీయ బుక్ ఫెయిర్
- 11 రోజులపాటు నిర్వహణ
- 365 స్టాల్స్‌లో మూడు లక్షల పుస్తకాలు
- కొలువుదీరనున్న వేలాది గ్రంథాలు
- అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పుస్తక ప్రియులు ఎప్పుడెప్పుడాని ఎదురు చూస్తున్న పుస్తకాల పండుగ వచ్చేసింది.ఇది పుస్తకాల రుతువు. నేటి నుంచి ప్రారంభం కానున్న 36వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన 11 రోజుల పాటు నగరవాసులను అలరించనుంది. వందలాది స్టాళ్లు, లక్షలాది పుస్తకాలు, ఆవిష్కరణలు, ఉపన్యాసాలు, మిత్రుల కరచాలనాలు, 4 మాటలు.. వేడివేడి ఛాయ్ కబుర్లు, ఇది ఈ రుతువు ప్రత్యేకత. సాహిత్యానికి ఎల్లలు లేవు. ఆధ్యాత్మికం నుంచి విప్లవం దాకా అన్నీ ఆ సముంద్రలోని అలలే. ప్రతి మనిషి తమ అభిరుచి, ఆసక్తి మేరకు పుస్తకాలను ఒక చోట ఎంపిక చేసుకునే అవకాశం ఇది.

హైదరాబాద్ జాతీయ బుక్ ఫెయిర్‌ను గతం కంటే భిన్నంగా పుస్తక ప్రియులను మరింత ఆకట్టుకునేలా నిర్వహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 365 స్టాళ్లతో పుస్తక ప్రదర్శన ఉంటుంది. అందులో జనరల్, ఇంగ్లీషుకు సంబంధించి 214, తెలుగు భాషకు సంబంధించి 115, స్టేషనరీ, హిందీ, ప్రభుత్వం, మీడియా స్టాల్స్ 36, రచయిత లకు ఆరు స్టాల్స్ ఉండనున్నాయి. ఈ బుక్ ఫెయిర్‌కు ఢిల్లీ, ముంబయి, మద్రాస్, విజయవాడ తదితర రాజధానుల నుంచి వివిధ పబ్లిషర్స్ ప్రచురించిన అన్ని భాషలలోని పుస్తకాలను ప్రదర్శన కు ఉంచనున్నారు. తెలుగు హిందీ, ఉర్దూ, సంస్కృ తం, ఇంగ్లీష్ తదితర భాషలలో పుస్తకాలు అందుబాటులో ఉంటాయి.

తక్కువ ఖర్చుతో ఆవిష్కరణలకు అవకాశం..

ఈ బుక్ ఫెయిర్‌లో కొత్త రచయితలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకున్నారు. పుస్తకా విష్కరణలకు గతం కంటే తక్కువ ఖర్చుతో వేదికను అందిస్తున్నారు. గతంలో రూ. మూడు వేలు ఉంటే.. ఈసారి రూ.1500కు తగ్గించడం విశేషం. అలాగే రచయితల ఆర్థిక స్థోమత లేకపోయినా వారి పుస్తకాలను ప్రమోట్ చేయడం, విక్రయించి వారిని ప్రోత్సహించడం వంటి చర్యలు తీసుకోనున్నారు. ఈ ప్రదర్శనలో చిన్న రచయితలకు పది రోజులకు గాను అతి తక్కువ ఖర్చుతో స్టాల్స్ ఏర్పాటు చేసే అవకాశం కల్పించారు. దేశంలో ఏ పుస్తక ప్రదర్శనలోనూ ఇలాంటి సౌకర్యం లేదు. అంతేగాక 10 నుంచి 18వ తేదీ వరకు వివిధ రకాల సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పిల్లల్లో పుస్తక పఠనాభిలాషను పెంపొందించడానికి ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నా రు.

ప్రదర్శన వేళలు ఇలా..

11 రోజులపాటు జరిగే హైదరాబాద్ బుక్ ఫెయిర్ శుక్రవారం నుంచి సోమవారం వరకు రోజూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు కొనసాగనుంది. శని, అదివారాలు, సెలవు రోజుల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు కొనసాగనుంది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, జర్నలిస్టులకు ప్రవేశం ఉచితం. కాబట్టి జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాల తమ విద్యార్థులను ఈ బుక్ ఫెయిర్‌ను సందర్శించే విధంగా చొరవ తీసుకోవాలి.

పుస్తకం జీవిత వికాసం

ఆర్ వాసు, కార్యదర్శి, హైదరాబాద్ బుక్ ఫెయిర్

పుస్తకాలు చదవడం ద్వారా జీవితం వికసిస్తుంది. హైదరాబాద్ బుక్ ఫెయిర్-2024లో భాగస్వాములవు తున్నందుకు సంతోషంగా ఉంది. 36వ జాతీయ పుస్తక ప్రదర్శనకు అంతా సిద్ధం చేశాం. ఈ పుస్తక మహోత్సవాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభించనున్నారు. 365కు పైగా స్టాల్స్‌లో తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సుమారు మూడు లక్షల గ్రంథాలు, పుస్తకాలు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పుస్తకాలు ఈ బుక్ ఫెయిర్‌లో కొలువుదీరనున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు, కవులు, రచయితలు, కళాకారులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుతున్నాం. పుస్తక ప్రియులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి వసతి, ఇతర ఏర్పాట్లు చేశాం. స్టాల్స్ నిర్వహకులకు ప్రతిరోజూ సాయంత్రం స్నాక్స్ అందించనున్నాం. ఈ పుస్తక ప్రదర్శన ప్రాంగణానికి గద్దర్, వేదికకు రవ్వా శ్రీహరి, ద్వారానికి ఉర్దూ దినపత్రిక సియాసత్ మాజీ ఎండి జహీరొద్దీన్ అలీ ఖాన్, మరో ద్వారానికి ఈనాడు మాజీ విలేకరి నర్సింగ్‌రావు పేరును పెడుతున్నాం. పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో తెలంగాణ అమర వీరుల స్మారకస్థూపాన్ని, గద్దర్ ఫొటోతో సెల్ఫీ దిగేందుకు ఏర్పాట్లు చేశాం.

హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌కు ఏర్పాట్లు పూర్తి

ఎన్టీఆర్ స్టేడియం కళాభారతిలో ఈనెల 9 నుంచి 19వ తేదీ వరకు 36వ జాతీయ పుస్తక ప్రదర్శన 'బుక్ ఫెయిర్' నిర్వహించనున్నట్టు హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, కార్యదర్శి ఆర్.వాసు అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బుక్ ఫెయిర్‌ను సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నారని చెప్పారు. గత జనవరిలో కలకత్తాలో జరిగిన పుస్తక ప్రదర్శనను 29 లక్షల మందికి పైగా పుస్తక ప్రియులు సందర్శించారని, ఆ స్థాయికి హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఎదగాలన్నారు. జ్ఞాన తెలంగాణ నిర్మాణానికి పుస్తక ప్రదర్శనలను సాధనాలుగా తయారు చేస్తున్నామని తెలిపారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రాంగణం విశాలంగా ఉండేటుట్టు రూపొందించామన్నారు. ప్రతి ఏడాదీ డిసెంబర్ నెలలో నిర్వహించే ఈ పుస్తక ప్రదర్శన అనివార్య కారణాల వల్ల ఆలస్యమైందన్నారు. అందులో ప్రధానంగా ఎన్నికలు, ఎన్‌టిఆర్ స్టేడియంలో ఇతర కార్యక్రమాలు ఉండటమన్నారు. పిల్లల్లో పుస్తక పఠనాభిలాషను పెంపొందించడానికి ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పుస్తక ప్రదర్శన ప్రాంగణానికి ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరును, వేదికకు సాహిత్య రంగానికి విస్తృత సేవలు అందించిన రవ్వా శ్రీహరి పేరును పెడుతున్నామని తెలిపారు. ద్వారానికి ఉర్దూ దినపత్రిక సియాసత్ మాజీ ఎండి జహీరొద్దీన్ అలీఖాన్ పేరు పెడుతున్నామన్నారు. పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో తెలంగాణ అమర వీరుల స్మారకస్థుపాన్ని పెడుతున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షులు నారాయణ రెడ్డి, కోయ చంద్రమోహన్, సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, కార్యవర్గ సభ్యులు సూరిబాబు, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐదేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా నర్మెట్ట మండలంలోని మల్కపేట గ్రామంలో గురువారం జరిగింది. మల్కపేట గ్రామంలో ఇంటి ముందు బానోతు బిజన్ అనే ఐదేళ్ల బాలుడు ఆడుకుంటుండగా ఒక్కసారిగా వీధి కుక్కల దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన బాలున్ని తల్లిదండ్రులు వెంటనే జనగామ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ కుత్బుల్లాపూర్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన మహ్మద్ (22) ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. కుత్బుల్లాపూర్‌లోని వసతి గృహంలో ఉంటున్నాడు. గురువారం హాస్టల్‌లో ఉరేసుకుని మహ్మద్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే కెఆర్ఎంబి నాటకం

- బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయని, లోక్ సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కెఆర్ఎంబి సమస్యను ఆ రెండు పార్టీలు తెరమీదకు తెచ్చాయని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ విమర్శించారు. గురువారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ఆయన మాట్లాడారు. 2014కు ముందు కెఆర్ఎంబి లేదని చెప్పారు. విభజన బిల్లులో ఆ అంశాన్ని చేర్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తప్పుచేసి బిజెపి మీదకు నెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ఆ రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం బయట పడకుండా జాగ్రత్త పడుతున్నారని ఆరోపించారు. కెఆర్ఎంబి అంశాన్ని సభలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై గతంలో సిబిఐ విచారణ కావాలని అడిగిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు అటువైపుగా ఆలోచన చేయడంలేదని ప్రశ్నించారు.

బిజెపి పాలనలో ఫెడరలిజం విచ్ఛిన్నం

- రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న మోడీ సర్కారు
- దేశ ప్రజల కోసం పోరాడుతున్న విజయన్
- తెలంగాణకు కేంద్రం వివక్షపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి
- కేంద్ర ప్రభుత్వ పాలేర్లుగా గవర్నర్ల వ్యవస్థ
- పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడిస్తేనే దేశ సమైక్యత సాధ్యం
- కేరళ సంఘీభావ ధర్నాలో బివి రాఘవులు



ధర్నాలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఫెడరలిజాన్ని విచ్చిన్నం చేస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శించారు. రాష్ట్రాల హక్కులను అది కాలరాస్తోందని అన్నారు. ఇది కేరళతోపాటు అన్ని రాష్ట్రాలకూ తీవ్ర నష్టదాయకమని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షను నిరసిస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సంఘీభావ ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ కేరళ వామపక్ష ప్రభుత్వం పట్ల ఆర్థికంగానే కాకుండా రాజకీయంగా కేంద్రం వివక్షను చూపుతున్నదని విమర్శించారు. సమాఖ్య వ్యవస్థను దెబ్బతీస్తోందని అన్నారు. కేంద్రం వివక్షపై కర్ణాటక సిఎం సిద్ధరామయ్య ఢిల్లీలో, బెంగాల్ సిఎం మమత బెనర్జీ కలకత్తాలో ధర్నా చేశారని చెప్పారు. ఆప్ నిరసన వ్యక్తం చేసిందన్నారు. జిఎస్‌టి, సెస్, సర్‌చార్జీలను కేంద్రం వసూలు చేస్తోందని వివరించారు. జిఎస్‌టిలో కేంద్రం 40 శాతం, రాష్ట్రాలకు 60 శాతం వాటా ఇవ్వాలంటూ కేరళ ప్రభుత్వం ప్రతిపాదించిందని గుర్తు చేశారు. ప్రజలకు మేలు జరగాలన్నా, పథకాలు అమలు కావాలన్నా రాష్ట్రాలకు 60 శాతం నిధులివ్వాలని డిమాండ్ చేశారు. సెస్, సర్‌చార్జీ వసూళ్లలో రాష్ట్రాలకు ఒక్క శాతం కూడా నిధులివ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మొన్నటి కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో కార్పొరేట్ పన్నును 33 శాతం నుంచి 20 శాతానికి తగ్గించారని చెప్పారు. దేశభక్తి అంటే ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి కార్పొరేట్ వ్యక్తులైన అంబానీ, అదానీల పన్ను తగ్గించడం కాదన్నారు. సామాన్య ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సిఎం పినరయి విజయన్ కేరళ కోసం కాకుండా దేశం కోసం, ప్రజల కోసం పోరాడుతున్నారని వివరించారు. నిత్యం వాడే సరుకుల మీద సెస్, సర్‌చార్జీలను విధించి కేంద్రం మోసం చేసిందని విమర్శించారు. 2015-16లో ఆరు శాతం సెస్, సర్‌చార్జీ వసూళ్లుంటే, 2023-24 ఆర్థిక సంవత్సరానికి 12 శాతానికి పెరిగిందన్నారు. జిఎస్‌టి వసూళ్లు పెరిగితే రాష్ట్రాలకు ఉపయోగమని చెప్పారు. కానీ సెస్, సర్‌చార్జీ వసూళ్ల మొత్తం కేంద్రం ఖజానాకే వెళ్తాయన్నారు. వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని, లేదంటే ఆ వసూళ్లను తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్రం అమలు జరిపే పథకాలను 50 శాతం నిధులు రాష్ట్రాలు భరించాలని అన్నారు. ఇలా 59 పథకాలున్నాయని వివరించారు. ఆయా పథకాలను రాష్ట్రాలతో చర్చించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిధులు కేంద్రం ఇవ్వాలని, పథకాల రూపకల్పన రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తాయని చెప్పారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు 700 వరకు ఉన్నాయని అన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కం)ను బాగు చేసే పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టిందన్నారు. అయితే మోటార్లకు మీటర్లు పెడితేనే నిధులిస్తామంటూ షరతు విధించిందని చెప్పారు. ప్రజలపై భారాలు మోపే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేసి లొంగదీసుకుంటోందని అన్నారు. కేంద్రం నిధులిస్తేనే కేంద్ర ప్రాయోజిత పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తాయని సూచించారు. అమల్లో లోపాలున్నా, అవినీతి జరిగినా ప్రజలే గమనించి తగిన గుణపాఠం చెప్తారని వివరించారు. 2014 తర్వాత తెలంగాణకు కేంద్రం న్యాయం చేసిందా? అన్యాయం చేసిందా?అనే దానిపై సిఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రానికి జరిగిన వివక్షపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. రాష్ట్రంలో బిజెపి ప్రమాదం ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఏడు నుంచి 14 శాతానికి ఓట్లు పెరిగాయని వివరించారు. ఎన్నికల కోసమైనా బిజెపి తీరును ఎండగట్టాలన్నారు. రాష్ట్రంలో వివిధ అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటిస్తోందని, అయితే నిధులను బొక్కేసిన వారందరి వివరాలూ బయటికి రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం బొక్కేసిందని విమర్శించారు. జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి తొలగిస్తూ 370 అధికరణాన్ని రద్దు చేసిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం ఒకే దేశం ఒకే ఎన్నికలు అంటోందని, వార్డు నుంచి పార్లమెంటు వరకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించాలని కేంద్రం భావిస్తోందని అన్నారు. స్థానిక అంశాలు, పరిస్థితులు కాకుండా మోడీని, జాతీయ పరిస్థితులను చూసి ఓట్లు వేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇప్పుడు ఒకే దేశం ఒకే రిజిస్ట్రేషన్ అంటున్నారని, ఎక్కడి నుంచైనా భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఇది రాష్ట్రాల ఆదాయానికి గండి పడి కేంద్రం నుంచి నిధుల కోసం పడిగాపులు పడాల్సి వస్తుందన్నారు. కేంద్రం పాలేర్లుగా గవర్నర్ల వ్యవస్థ ఉందని విమర్శించారు. తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, కేరళ, ఢిల్లీ గవర్నర్లు ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు అసెంబ్లీలో చేసిన బిల్లులను ఆమోదించడం లేదన్నారు. గవర్నర్లే ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దేశ సమైక్యతకు భంగం కలిగేలా పాలకవర్గాల విధానాలున్నాయని చెప్పారు. సమాఖ్యవాదాన్ని అది ధ్వంసం చేస్తోందని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆ పార్టీ ఎంత బలహీనపడితే దేశానికి, సమైక్యతకు అంత ఉపయోగమని అన్నారు. దేశాన్ని, ఫెడరలిజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

కేరళ అభివృద్ధిలో ఆదర్శం : చెరుపల్లి

కేరళ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ఇది దేశానికే ఆదర్శమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. మోడీ మాటలు వేరు, చేతలు వేరని విమర్శించారు. ప్రశ్నించే మేధావులు, రాజకీయ నాయకులపై దాడులు చేస్తున్నారని చెప్పారు. లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక స్వావలంబన, సామాజిక న్యాయం, ఫెడరలిజాన్ని ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ పౌరుషం ఉన్న గడ్డ, ఇక్కడ బిజెపి ఆటలు సాగబోవని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మోడీ రాజ్యాంగేతర పనులు చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు కుట్ర చేస్తున్నారని, లొంగకుంటే ఇడి, సిబిఐని ప్రయోగిస్తున్నారని అన్నారు. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం, లౌకికత్వం ఉండబోదని చెప్పారు. బిజెపి విధానాలను ప్రతిఘటించాలని, ఆ పార్టీని తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం పెరుగుతుంటే రామపజం చేస్తున్నాని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జాన్‌వెస్లీ, పాలడుగు భాస్కర్, టి సాగర్, ఎండి అబ్బాస్, హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కార్యదర్శులు కె భాస్కర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆత్మహత్య కారకులను వెంటనే శిక్షించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్‌సి వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎస్‌సి హాస్టల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఘటన జరిగి ఆరు రోజులు అవుతున్నా ఆత్మహత్యకు గల కారణాలను సంబంధిత అధికారులు స్పష్టంగా చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. హాస్టల్లో సిసి కెమెరాలు, శుభ్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మాయిలు ఆత్మహత్య చేసుకున్న రూం, పరిసర ప్రాంతాలను చూస్తే చాలా అనుమానాస్పదంగా ఉన్నదన్నారు. వార్డెన్, పిఇటి, డ్రైవర్, వంట మనిషి వీరందరిపైనా పోలీసులు, శిశు సంక్షేమశాఖ అధికారి, జిల్లా కలెక్టర్ నియమించిన ప్రత్యేక విచారణ అధికారి సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థినులకు భరోసా కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, కోశాధికారి కల్లూరి నాగమణి, పట్టణ అధ్యక్షులు మాయ రాణి ఉన్నారు.

రాష్ట్రాలపై కేంద్రం వివక్షత ఆపాలి

- రాష్ట్ర వ్యాప్తంగా కేరళ సంఘీభావ ధర్నాలు, ర్యాలీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రాలు, కేరళ వామపక్ష ప్రభుత్వంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూపుతున్న వివక్షను ఆపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం సంఘీభావ కార్యక్రమాలు జరిగాయి. సిపిఎం ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసన ర్యాలీలు తీవారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పిఎస్ భవన్ నుంచి ఐబీ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలో పోస్టాఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోందని సిఐటియు జాతీయ కౌన్సిల్ సభ్యులు తుమ్మల వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నెహ్రూగంజి హమాలి ఆఫీసు నుంచి కేరళ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ముందు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.

ప్రేమ పేరుతో కిరాతకం

- యువతిని నడిరోడ్డుపై నరికిన యువకుడు
- మరో మహిళ, బాలుడిపై హత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యువకుడి కిరాతకానికి ఓ యువతి నిండు ప్రాణం బలైంది. ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని వేధించాడు. యువతి కాదనడంతో నడిరోడ్డుపై కత్తితో నరికి చంపాడు. ఈ ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణం అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన శెట్టిపల్లి అలేఖ్య(21)ను అదే కాలనీకి చెందిన జుకింది శ్రీకాంత్ ఐదు సంవత్సరాలుగా ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో యువతి కుటుంబ సభ్యులు నాలుగైదు నెలల కిందట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు యువకుడిని పిలిచి మందలించారు. అయినా అతను తీరు మార్చుకోలేదు. గురువారం అలేఖ్య తన వదిన జైశీల, మూడేళ్ల మేనల్లుడు రియాన్స్‌తో కలిసి టైలరింగ్ షాప్‌కు వెళ్లి వస్తుండగా శివాజీనగర్ మెయిన్ రోడ్డుపై శ్రీకాంత్ కత్తితో అడ్డగించాడు. అలేఖ్యను విచక్షణరహితంగా నరికాడు. అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేసిన జైశీల, రియాన్స్‌పైనా కత్తితో దాడి చేశాడు. జైశీల, రియాన్స్ తలకు తీవ్ర గాయమైంది. నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. అలేఖ్య రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. జైశీల, ఆమె కుమారుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లింబాద్రి తెలిపారు.

రజక వృత్తిదారులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రజక వృత్తిదారులకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు గుమ్మడి రాజు నరేష్ అధ్యక్షతన హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో రజక వృత్తిదారుల సంక్షేమానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వీరనారి ఐలమ్మ విగ్రహం ట్యాంక్ బండ్‌పై పెట్టాలన్నారు. ప్రభుత్వ సంస్థల వృత్తి కాంట్రాక్టు జిఒ, నెం 102 కు గైడ్‌లైన్స్ రూపొందించి వృత్తిదారులకు ఉపాధి కల్పించాలని, రజక ఫెడరేషన్‌కు వెంటనే పాలకవర్గాన్ని నియమించాలని కోరారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బసిబంధు పథకానికి దరఖాస్తు చేసుకున్న వృత్తిదారులకు వెంటనే లక్ష ఆర్థిక సహకారాన్ని మంజూరు చేయాలని, ఆ పథకాన్ని కొనసాగించాలని అన్నారు. మోడ్రన్ దోబీఘాట్లు ప్రతి మండల కేంద్రం, జిల్లా కేంద్రంలో నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రజకులపై, దౌర్జన్యాలను అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. బాలకృష్ణ, సి మల్లేష్, ఏదునురి, మదారు, అన్నారపు వెంకటేశ్వర్లు, పాయిరాల రాములు, ఎం గోపాల్, ఎస్ సుభద్ర, ముదిగొండ రాంబాబు, పెద్దాపురం భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- సమర్పణకు తుది గడువు 22

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతితోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించి ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాటి సమర్పణకు తుదిగడువు ఈ నెల 22 వరకు ఉంది. ఏడు నుంచి పదో తరగతి వరకు ఖాళీ సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఒసిలు రూ.200, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, వికలాంగులు, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125 దరఖాస్తు ఫీజు చెల్లించాలని కోరారు. ఆరో తరగతిలో 18,781 సీట్లు, ఏడు నుంచి పదో తరగతి వరకు 12,267 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఇతర వివరాల కోసం http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

బిఆర్ఎస్ నేతల అరెస్ట్, రిమాండ్

- డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌తో పాటు మరో ముగ్గురి అరెస్ట్
- దేవాలయ భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు
- ఆ శాఖ అధికారుల ఫిర్యాదుతో రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్‌శాఖల విచారణ
- అరెస్టు సందర్భంగా నేలకొండపల్లిలో అర్ధరాత్రి హైడ్రామా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువు రెవెన్యూలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ భూముల్లో నుంచి అక్రమ మట్టి తవ్వకాలు చేశారనే ఫిర్యాదుపై బిఆర్ఎస్ నేతలను పోలీసులు బుధవారం అర్ధరాత్రి తర్వాత అరెస్టు చేశారు. డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్ (ఏ1)తో పాటు శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం చైర్మన్ చెన్న వెంకన్న (ఏ2), ఆలయ కమిటీ డైరెక్టర్లు కొండ వెంకన్న (ఏ3), చింతలపాటి రామకృష్ణ (ఏ4)ను అదుపులోకి తీసుకున్నట్టు ఖమ్మం రూరల్ ఎసిపి బస్వారెడ్డి గురువారం తెలిపారు. వీరిపై కూసుమంచి పోలీసుస్టేషన్‌లో క్రైం నం.32/2004 అండర్ సెక్షన్ 120బీ, 409, 420, 447, 379 రెడ్‌విత్ 34 ఐపిసి అండ్ సెక్షన్స్ 3, 4 ఆఫ్ పిడిపిపి చట్టం కింద కేసు నమోదు చేశారు. బుధవారం అర్ధరాత్రి వీరిని అదుపులోకి తీసుకుని ముందుగా పాత సిపి కార్యాలయానికి, అక్కడి నుంచి నేలకొండపల్లి స్టేషన్‌కు తరలించినట్టు తెలిసింది. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఖమ్మం ప్రత్యేక సంచార న్యాయస్థానం న్యాయమూర్తి ఎదుట వారిని హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు.

కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే..

జీళ్లచెరువు గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 332, 333, 334, 337, 338, 306 అండ్ 305లో శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి దేవుని మాన్యం భూములున్నాయి. దీనిలోని 79 ఎకరాలు, 18.25 ఎకరాల చెరువు నుంచి రూ.61.29 లక్షల విలువైన 3.6 లక్షల మెట్రిక్ టన్నుల మట్టిని అక్రమంగా తరలించారని, అన్ని ఆధారాలతో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎ.సులోచన ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు మైనింగ్, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. అనంతరం కేసు నమోదు చేసినట్టు ఖమ్మం రూరల్ ఎసిపి తెలిపారు.

స్టేషన్ ఎదుట బిఆర్ఎస్ నేతల ఆందోళన

నేలకొండపల్లికి బిఆర్ఎస్ నేతలను తీసుకొచ్చారని సమాచారం అందుకున్న ఆ పార్టీ మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు బెల్లం వేణు ఆధ్వర్యంలో మూడు మండలాల కార్యకర్తలు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఒక దశలో స్టేషన్‌లోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. తెల్లవారుజామున నాలుగు గంటల వరకు ఆందోళన కొనసాగించారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ గురువారం ఉదయం పోలీసుస్టేషన్ వద్దకు వచ్చారు. అరెస్టులపై పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఖమ్మం బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్యతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బిఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేశారని ఖండించారు. కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని అన్నారు.

యువత సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేండ్లు యువకుల పక్షాన పోరాటం చేశానని, ఇప్పుడు వారి సమస్యలను తీర్చడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో అబిడ్స్ నుంచి గన్‌పార్కు వరకు ఆర్‌టిసి బస్సులో ప్రయాణించి.. మహిళలతో మాట్లాడారు. ఆర్‌టిసి ఉచిత ప్రయాణం, కాంగ్రెస్ రెండు నెలల పాలన గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎదుట గన్‌పార్కు వద్ద అమరవీరు స్థూపానికి నివాళ్లర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. అమరవీరుల ఆశీస్సులతోనే తాను ఈ స్థాయికి వచ్చినట్టు తెలిపారు. విద్యార్థుల పక్షాన చేసిన పోరాటాన్ని గుర్తించి, వారికి ప్రతినిధిగా తనను సభలోకి సిఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎఐసిసి అగ్రనాయకులు పంపించారని తెలిపారు. ఎప్పటికీ తనది యువత పక్షమేనని, విద్యార్థులు, యువకులకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతి సమస్యనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సహకరిస్తానన్నారు.

కరెంట్ మీటర్ రీడర్ల సమ్మె

- 'గృహజ్యోతి' వివరాలు నమోదు చేయం
- 30 రోజులు పని కల్పించాలి
- కనీస వేతనాలు ఇవ్వాలి
- ఆర్టిజన్లుగా గుర్తించాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరెంటు మీటర్ రీడర్లు సమ్మె బాట పట్టారు. సుదీర్ఘకాలంగా తమ సమస్యల్ని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవట్లేదని, గత్యంతరం లేకే సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని చెప్తున్నారు. పీస్ రేట్ వర్కర్లుగా పనిచేస్తున్న కరెంటు మీటర్ రీడర్లకు నెలలో కేవలం 15 రోజులు మాత్రమే పని ఉంటుంది. ఒక మీటర్‌కు రీడింగ్ తీస్తే వారికిచ్చేది కేవలం రూ.2.51 పైసలు. దానిలో కాంట్రాక్టర్లు 50 నుంచి 60 పైసలు మినహాయించుకొని మిగిలిన సొమ్మును వారికి చెల్లిస్తున్నారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పనిచేశాక, మిగిలిన రోజుల్లో ఖాళీగా ఉండాల్సి వస్తున్నది. మిగిలిన 15 రోజుల పనికూడా తమకు కల్పించాలని పలుమార్లు విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సంస్థల్లోని అనేక విభాగాల్లో వీరి సేవల్ని వినియోగించుకొనే అవకాశాలు ఉన్నా, యాజమాన్యం వారికి పని ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేయట్లేదు. సుదీర్ఘకాలంగా ఈ సమస్యపై వారు పలురూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. 15 రోజులు కరెంటు మీటర్ రీడింగ్ చేస్తే పీస్ రేట్ ప్రకారం వారికి వచ్చే వేతనం కేవలం రూ.ఐదు వేల నుంచి రూ. ఆరు వేలలోపు మాత్రమే. దీనిలోనే రవాణా ఖర్చులు కూడా భరించాలి. రాష్ట్రవ్యాప్తంగా రెండు డిస్కంల్లో దాదాపు 2,200 మంది మీటర్ రీడర్లు కాంట్రాక్టర్ల ద్వారా పనిచేస్తున్నారు. తమకు 30 రోజులు పని కల్పించి, కనీస వేతనాలు ఇస్తూ ఆర్టిజన్లుగా గుర్తించాలనేది వారి ప్రధాన డిమాండ్. అనేక పోరాటాల ఫలితంగా వీరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించారు. అయితే కాంట్రాక్టర్లు పీఎఫ్ సొమ్మును సక్రమంగా చెల్లించట్లేదు.

'గృహజ్యోతి'తో తిప్పలు

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మీటర్ రీడింగ్‌తో పాటు వినియోగదారుల ఫోన్ నెంబర్, ఆధార్ నెంబర్, ఆహార భద్రతా కార్డు నెంబర్లు (రేషన్‌కార్డు) కూడా నమోదు చేయాలని కాంట్రాక్టర్లు మీటర్ రీడర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఒక్కో మీటర్‌కు సంబంధించి వివరాల నమోదుకు 15 నుంచి 20 నిముషాల సమయం పడుతున్నదనీ, దీనివల్ల నిర్ణీత గడువులోపు తమకు అప్పగించిన మీటర్ల రీడింగ్ తీయలేకపోతున్నామని వారు చెప్తున్నారు. రీడింగ్ ఆలస్యం అయితే వినియోగదారుల శ్లాబ్ రేట్లు మారిపోయి, కరెంటు బిల్లులు అధికంగా వచ్చే ప్రమాదం ఉంది. ఇదే విషయాన్ని కాంట్రాక్టర్లకు చెప్తే పట్టించుకోవట్లేదు. దీనితో ఈ నెల 6, 7 తేదీల్లో మీటర్ రీడర్లు రాష్ట్ర వ్యాప్తంగా తమ వద్ద ఉన్న మీటర్ రీడింగ్ యంత్రాలను కాంట్రాక్టర్లకు అప్పగించేశారు. యాజమాన్యంతో మాట్లాడి తమ సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. అయితే దీనికి కాంట్రాక్టర్లు అంగీకరించలేదు. 'మీ సమస్యలు పరిష్కారమైతే, మా ఆదాయం పోతుంది' అంటూ రీడింగ్ యంత్రాలు స్వాధీనం చేసుకొని సైలెంట్ అయిపోయారు. ఫలితంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారెంటీల్లో ముఖ్యమైన గృహజ్యోతి, మహాలక్ష్మి స్కీంలకు సంబంధించిన డేటా ఎంట్రీ నిలిచిపోయింది. ఈ రెండు స్కీంలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేయనున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ సమస్యల్ని పరిష్కరించాలని మీటర్ రీడర్లు కోరుతున్నారు.

22 ఏళ్లుగా పనిచేస్తున్నాం

ఉన్నత చదువులు చదువుకున్నాం. ఇదే సంస్థను నమ్ముకొని 22 ఏళ్ల నుంచి పనిచేస్తున్నాం. మమ్మల్ని పీస్‌రేట్ వర్కర్లుగా చూడొద్దు. నెలకు 30 రోజులు పనికల్పించి, ఆర్టిజన్లుగా గుర్తించాలి. సిఎం రేవంత్‌రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన్ని కలిసి మా కష్టాలు చెప్పుకున్నాం. అధికారంలోకి వచ్చాక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు మా ఆశలన్నీ ఆయనపైనే ఉన్నాయి.

జి చిరంజీవి, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ దక్షిణ డిస్కం ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వానికి సహకరిస్తాం

సుదీర్ఘకాలంగా చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక నానా అవస్థలు పడుతున్నాం. మా సమస్యల్ని సిఎం రేవంత్‌రెడ్డి పరిష్కరించాలి. ప్రభుత్వానికి సహకరించేందుకు మేం సిద్ధం. మమ్మల్ని ఉద్యోగాల్లోంచి తీసేస్తామని కాంట్రాక్టర్లు బెదిరిస్తున్నారు. మాకు 30 రోజులు పని కల్పించండి.

కె శేఖర్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

పీస్ రేట్ అయినా...కనీస వేతనం ఇవ్వాల్సిందే

కార్మిక చట్టాల ప్రకారం పీస్‌రేట్ వర్కర్లు అయినా వారికి కనీస వేతనం చెల్లించాల్సిందే. కానీ అది అమలు కావట్లేదు. మీటర్ రీడర్లు చాలాకాలం నుంచి తమ సమస్యల్ని యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్తున్నారు. దీనిపై ఇటీవల ఎస్పిడిసిఎల్ సిఎండితో చర్చించాం. ఆయన సానుకూలంగా స్పందించారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది.

- ఇనుగాల శ్రీధర్, 327 యూనియన్ సెక్రటరీ జనరల్